ప్రజాశక్తి
గురువారం 28 నవంబర్ 2024
5
అనంతపురం

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

◆30న నేమకల్‌లో పింఛన్ల పంపిణీ
◆ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్, కలెక్టర్

ప్రజాశక్తి-బొమ్మనహాల్

బొమ్మనహాల్ మండలం నేమకల్ గ్రామంలో ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారు అయినట్లు కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుతో కలిసి ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్ పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి స్వయంగా గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. నేమకల్ ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఈశ్వరుని మాన్యం పొలంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో అన్ని పనులనూ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో దాస్‌నాయక్, ఈవోఆర్డీ దేవదాస్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

హెలిప్యాడ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

కూటమి 'టోల్' బాదుడు..!

కూటమి ప్రభుత్వం ప్రజలపై మరో బాదుడుకు సిద్ధం అయ్యింది. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలపై అదనపు వసూళ్లు చేస్తోంది. ఇప్పుడు రాష్ట్ర హైవేలపై టోల్‌గేట్ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు జాతీయ రహదారులపైనే టోల్‌గేట్లు ఉండేవి. ఇక రాష్ట్ర హైవేలపైనా వీటి ఏర్పాటుకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది.

పిపిపి(పబ్లిక్-ప్రయివేటు పార్ట్‌నర్‌షిఫ్) పేరుతో రహదారుల నిర్మాణానికి సముఖతను వ్యక్తం చేసింది. ఇటీవలే అసెంబ్లీ వేదికగా ఈ అంశంపై ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారు. ఇది అమల్లోకి వస్తే వాహన దారులకు అదనపు టోల్ బాదుడు తప్పదు.

◆ రాష్ట్ర రహదారులపై టోల్ వసూలుకు రంగం సిద్ధం
◆ పిపిపి మోడల్‌లో రాష్ట్ర హైవేలు
◆ తొలిదశలో 'అనంత'లో రెండు రోడ్లు ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పిపిపి(పబ్లిక్- ప్రయివేటు పార్టునర్‌షిఫ్) పేరుతో రహదారుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో 18 రహదారులను ఈ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి రెండు రహదారులున్నాయి. దామాజిపల్లి-నాయనపల్లి క్రాస్-పెద్దపప్పూరు మీదుగా తాడిపత్రి 99 కిలోమీటర్ల రహదారిని పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. సత్యసాయి జిల్లాలో సోమందేపల్లి-హిందూపురం మీదుగా తూముకుంట వరకు మొత్తం 35.53 కిలోమీటర్లు పిపిపి మోడల్‌లో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. రెండో దశలో రాష్ట్ర వ్యాప్తంగా 68 రహదారులను ఈ పద్ధతిలో అభివృద్ధి చేస్తారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా రహదారులు ఎన్ని అన్నది తెలియాల్సి ఉంది.

జిల్లాలో మొత్తం 31 రాష్ట్ర హైవేలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 32 రాష్ట్ర హైవేలు ఉన్నాయి. మొత్తం 1197.11 కిలోమీటర్లు ఉంటాయి. వీటి వివరాలు ఈ విధంగానున్నాయి. హిందూపురం-కదిరి, జమ్మలమడుగు-కదిరి, రాజంపేట-కదిరి, గుంతకల్లు-ఉరవకొండ, గుంతకల్లు-తుంగభద్ర రోడ్డు, నెల్లూరు-బళ్లారి-ముంబాయి రోడ్డు, దామాజీపల్లి-నాయనపల్లి క్రాస్-పెద్దపప్పూరు, నాగసముద్రం-పేరూరు, గుత్తి-పత్తికొండ, ఆదోని, కోడూరు-ధర్మవరం రోడ్డు, హిందూపురం-సోమందేపల్లి, అనంతపురం-తగరకుంట, ననకోట రోడ్డు, కొండాపురం-దంతపల్లి రోడ్డు, బాలసముద్రం- కొక్కంటి-పెడబల్లి రోడ్డు, ధర్మవరం- తగరకుంట రోడ్డు, హిందూపురం- బెంగళూరు రోడ్డు, పెనుకొండ-ముదిగుబ్బ, దొరిగల్లు రోడ్డు, పెనుకొండ- మడకశిర రోడ్డు, కళ్యాణదుర్గం-మడకశిర రోడ్డు, బళ్లారి- గుండ్లపల్లి రోడ్డు, రాయదుర్గం-కణేకల్ రోడ్డు, మడకశిర- అమరాపురం రోడ్డు, పామిడి-వజ్రకరూరు రోడ్డు, ఉరవకొండ-కణేకల్ వయా సొల్లాపురం రోడ్డు, బత్రేపల్లి-తలుపుల- పెద్దన్నవారిపల్లి మీదుగా గండి రోడ్డు, మహమ్ముదాబాద్- మారాపల్లి, బాలసముద్రం రోడ్డు, కళ్యాణదుర్గం-నాగేపల్లి గేట్ వయా కుందుర్పి, అమరాపురం-వీరపసముద్రం రోడ్డు, కంబదూరు-పేరూరు రోడ్లు ఉన్నాయి.

రోడ్ల అభివృద్ధి పేరుతో బాదుడు

ఇప్పటి వరకు ప్రభుత్వాలు రోడ్లను నిర్మించి ఎటువంటి టోల్‌గేట్లు లేకుండా వాహనాల రాకపోకలు జరుగుతూ ఉండేవి. ప్రస్తుతం రోడ్లు అభివృద్ధి చేసే పేరుతో ప్రయివేటుకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. రోడ్లు వేసే ఈ వాహనాలపై అదనపు భారం పడనుంది. ఇప్పటికే జాతీయ రహదారులపై టోల్‌గేట్ల బాదుడు కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని జల్లిపల్లి, వడ్డుపల్లి, బత్తపల్లి, కదిరి, గుత్తి, మరూరు, బాగేపల్లి టోల్‌గేట్లు జాతీయ రహదారులపై ఉన్నాయి. వాహన సామర్థ్యాన్ని బట్టి రూ.125 నుంచి రూ.300 వరకు టోల్‌గేట్ ఛార్జీలను ఇప్పటికే వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా ఇక అదనంగా కొత్తవి వస్తే రవాణాపై భారం పడనుంది. ప్రధానంగా రైతులపై ఈ భారం అధికంగా ఉండనుంది. పంట ఉత్పత్తులను అమ్మకాలకు నాలుగు చక్రాల వాహనాల్లోనే తీసుకెళ్లాలి. ఇలాంటి సమయంలో రైతులకు టోల్ ఛార్జీలు అదనపు భారం కానుంది. ఇక ఆర్టీసీ బస్సు ప్రయాణికులపైనా ఈ భారం పడుతుంది. టోల్ ఛార్జీల భారాన్ని ప్రయాణికుడి ఛార్జీలోనే కలిసి వేస్తారు. దీని వల్ల ఆ భారాన్ని ప్రయాణికుడు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక కారు, ఇతర నాలుగు చక్రాలకు మించి ఉన్న వాహనదారులు అందరికీ ఈ భారం తప్పదు.

అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వేలకోట్ల రూపాయల లంచాలు మెక్కి, సెకీ ద్వారా అదానీ కంపెనీ ఆంధ్ర ప్రజలపై వేల కోట్ల విద్యుత్ భారాలను వేసిందని సిపిఎం జిల్లా కమిటీ విమర్శించింది. గతంలో వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం రాష్ట్ర ప్రభుత్వ అసలు నైజాన్ని బయటపెడుతోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనమంటూ కాలయాపన చేసి ఇంత పెద్ద కుంభకోణాన్ని మరుగుపర్చాలని చూస్తున్నట్లు ఉందన్నారు. గత ప్రభుత్వ అవినీతిపై రంకెలు వేస్తూ ఇప్పుడు అదానీకి తల వంచడం ఏమిటని ప్రశ్నించారు. అదానీ గ్రూపు సంస్థలు రూ.1,750 కోట్లు లంచాలు ఇచ్చి సెకీ నుంచి యూనిట్ 2.49 పైసల చొప్పున కొనుగోలు చేయాలని గత రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఆ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. అలా చేయకుండా ఆ ఒప్పందాలపై టిడిపి కూటమి సర్కారు పునరాలోచన చేస్తున్నట్టు, రాజస్థాన్‌లో ఉత్పత్తి చేసిన కరెంటు బదులు ఆంధ్రప్రదేశ్‌లో అదానీ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అంతర్రాష్ట్ర రవాణాఛార్జీ తగ్గి చౌకగా కరెంటు వస్తుందని ప్రజల్ని నమ్మించడానికి పత్రికల్లో కట్టుకథలు రాయిస్తున్నారన్నారు. అనంతపురం జిల్లాలో వేల ఎకరాల భూమిని ఆదానీ కంపెనీకి అప్పగించేందుకు ఇప్పటికే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. సెకీ ఒప్పందాల రద్దుపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు కూడా లీకులు వచ్చాయన్నారు. అవి ఏపీ సాధ్యం కాకపోతే రేటు తగ్గించి విద్యుత్ ఇవ్వండంటూ అదానీ కంపెనీలనే రాష్ట్ర ప్రభుత్వం కోరుతుందని ఒక మంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట ప్రభుత్వం దాగుడుమూతలు మాని తక్షణం అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్ సమావేశం

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పోలీసు బందోబస్తు మధ్య కౌన్సిల్ సమా వేశం నిర్వహించారు. వివరాలు.. పాలకవర్గం ఆమోదం లేకుండా అధికారులు పనులు చేస్తున్నారని గత నెలలో జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు బహిష్కరించారు. దీంతో మరోసారి అలాజరగకుండా కౌన్సిల్ సభ్యులు సమావేశాన్ని కొనసాగించాలని, బడ్జెట్ అంచనాలు, అజెండాలోని అంశాలను ఆమోదించి అభివృద్ధికి పాటుపడాలని, లేనిచో కార్యాలయం వద్ద ధర్నా చేపడ తామని టిడిపి నాయకులు స్పష్టం చేశారు. దీంతో కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలిసిన వెంటనే సిఐ బి.వెంకటేశ్వర్లు సిబ్బందితో కార్యాలయానికి చేరుకొని బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి అధ్యక్షతన బడ్జెట్, కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. బడ్జెట్ అజెండాలోని అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కౌన్సిలర్లు వి.వరదరాజులు ఎన్.ఫారుక్ అపార్ కష్టాలను లేవనెత్తారు. ధ్రువీకరణ పత్రాలకు రుసుము వసూలు చేయడం భావ్యం కాదన్నారు. పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషాను పలువురు కౌన్సిలర్లు అభినందించారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, కమిషనర్ బి.జబ్బార్‌మియా, డిఇ హేమచంద్ర, టిపిఒ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

1న యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు

విజయవంతం చేయండి : మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

యుటిఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల ఆహ్వాన పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 1వ తేదీన ఆ సంఘం జిల్లా స్వర్ణోత్సవ వేడుకలను రాయదుర్గంలో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పోస్టర్లను యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో డిసెంబర్ 1వ తేదీ ఆదివారం రాయదుర్గంలో జరిగే జిల్లా స్థాయి స్వర్ణోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల రక్షణకు కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంలోనూ కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని రద్దు చేయాలన్నారు. పేద బడుగు బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, దేవేంద్రమ్మ, నాయకులు గంగాధర్, శివరుద్రప్ప, మెడికల్ రెప్స్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పాలక వర్గం అధిక ప్రాధాన్యత ఇస్తోందని నగర మేయర్ మహమ్మద్ వసీం, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. నగరంలోని 13వ డివిజన్ పరిధిలో రూ. 38 లక్షల వ్యయంతో చేపడుతున్న ప్రొటెక్షన్ వాల్ నిర్మాణ పనులను బుధవారం వారు ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ వర్షం కురిస్తే 13వ డివిజన్ పరిధిలోని ఉమా నగర్‌లో ఇళ్లలోకి నీరు వెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. ఆ సమస్య పరిష్కారం కోసం గతంలో ఆర్డీటీ సంస్థ సహకారంతో తొలుత బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశామని, ఇప్పుడు నగర పాలక సంస్థ నిధులతో ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. ఇదే ప్రాంతంలో గతంలో ఎన్ క్యాప్ నిధులు రూ. 1.95 కోట్ల వ్యయంతో సూర్య నగర్ నుంచి త్రివేణి సర్కిల్ వరకూ రోడ్డు వెడల్పుతో పాటు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. దశల వారీగా నగరంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ నాగరాజు, కార్పొరేటర్లు సైఫుల్లా, బాలాంజనేయులు, కమల్‌భూషణ్, హసీనా బేగం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

కనిపించని ప్రభుత్వ సేవల చార్టు

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రభుత్వ సేవలను ప్రజలకు తెలియజేసేలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 100 సేవల చార్టులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ గత నెలలో మండల స్థాయి అధికారులకు సూచించారు. సేవలకు సంబంధించిన చార్టులనూ మండలాలకు పంపారు. అందులో భాగంగా యల్లనూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆ చార్టును ఏర్పాటు చేశారు. అయితే తహశీల్దార్ కార్యాలయంలో ఇప్పటికీ దీనిని ఏర్పాటు చేయలేదు. ప్రజా పరిషత్ కార్యాలయంలో చార్టును చూస్తున్న ప్రజలు తహశీల్దార్ కార్యాలయంలో ఎందుకు లేదని చర్చించుకుంటున్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు ఇవ్వండి : ఎస్ఎఫ్ఐ

సిద్ధూ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చలి తీవ్ర పెరిగిన నేపథ్యంలో బిసి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలను వెంటనే పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధూ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. రెండు రోజుల నుంచి అర్ధరాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీ లోపునే నమోదవుతున్నాయన్నారు. చాలా హాస్టళ్లలో తలుపులు, కిటికీలు సరిగా లేక చలిగాలులు ఎక్కువగా వీస్తున్నాయన్నారు. దీని వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి హాస్టల్ విద్యార్థులు అందరికీ దుప్పట్లు, దోమతెరలను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

14వ బెటాలియన్‌లో ముగిసిన క్రీడా మహోత్సవం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్‌లో జరుగుతున్న 3వ వార్షిక క్రీడా మహోత్సవం-2024 వేడుకలు బుధవారం ముగిశాయి. వేడుకలకు ముఖ్య అతిథి జెఎన్‌టియు స్పోర్ట్స్ ఆఫీసర్ జోజిరెడ్డి హాజరయ్యారు. క్రీడా మహోత్సవంలో గెలుపొందిన వారికి బెటాలియన్ కమాండెంట్ కె.ప్రభు కుమార్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా మహోత్సవంలో విజయం సాధించిన క్రీడాకారులు

అమిగోస్ వేధింపులను ఆపండి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ట్రాక్టర్ యజమానులు, హమాలీలు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పై రాయల్టీలు, పెనాల్టీల పేరుతో అమిగోస్ మినరల్స్, మైనింగ్ శాఖ సంయుక్తంగా వేధింపులను ఆపాలని ట్రాక్టర్ యజమానులు, హమాలీల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ట్రాక్టర్ యజమానుల సంఘం నాయకులు అన్నిరి నారాయణస్వామి మాట్లాడుతూ అమిగోస్ సంస్థ మట్టి రాళ్ల కంకరను రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై అకారణంగా ఇష్టానుసారం పెనాల్టీలు, రాయల్టీలు వేసి యజమానులు, హమాలీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అమిగోస్ మినరల్స్ సంస్థ ఒక్క అనంతపురం జిల్లా నుంచి 2023 ఏప్రిల్ నుంచి 2024 ఆగస్ట్ వరకు మైనింగ్ శాఖకు 150.12 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీనిని చెల్లించకుండా పేద ట్రాక్టర్ డ్రైవర్లపై మాత్రం పెనాల్టీలు వేసి బెదిరింపులకు దిగుతోందన్నారు. అమిగోస్ మినరల్స్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మార్చి 2025 వరకు ఉన్నప్పటికీ అనుమతి లేని ఎఎంఆర్ సంస్థకు అప్పజెప్పి అమిగోస్ సంస్థ పేరుతో దందాలు కొనసాగిస్తోందన్నారు. దీనిపై అధికారులు స్పందించి ఈ వేధింపులను ఆపేలా చూడాలన్నారు. అమిగోస్ మినరల్స్ సంస్థ కట్టాల్సిన బకాయి 150.12 కోట్ల రూపాయలను వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. మండలం నుంచి అనంతపురం నగరానికి రాళ్లు, మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులకు ఎలాంటి రాయల్టీ, పెనాల్టీలు వేయకుండా ఉచితంగా రవాణా చేసుకోవడానికి అనుమతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టర్ యజమానుల సంఘం నాయకులు సత్యనారాయణ, సిగిలిపల్లి నరసింహులు చింతకాయమంద వేణుగోపాల్, పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణలపై విచారణ చేపడతాం

మున్సిపల్ సమావేశంలో తహశీల్దార్ నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో వివిధ పథకాల కింద లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల స్థలాల ఆక్రమణ, దుర్వి నియోగంపై డిసెంబర్‌లోగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన పాలకమండలి సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు పద్మజ, గోవిందరాజులు, తదితరులు మాట్లాడుతూ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్లు, జగనన్న కాలనీలు, ఇతర కాలనీల్లో ఇళ్ల స్థలాల ఆక్రమణలను లేవనెత్తారు. స్పందించిన తహశీల్దార్ రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులతో కమిటీలు ఏర్పాటు చేసి ఆ ఆయా కాలనీల్లో విచారణ చేపట్టి డిసెంబర్‌లోగా నివేదిక తయారు చేస్తామన్నారు. ఆక్రమణలను తొలగించి, అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. బళ్లారి రోడ్డులోని వారపు సంత మైదానం వద్ద ఉన్న స్థలం వివాదం కోర్టులో ఉన్నందున ప్రభుత్వం తరఫున పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. తరచూ మోటార్లు కాలిపోవడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. కౌన్సిలర్ బండి అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటులో భాగంగా ఇళ్లు కోల్పో తున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగడం లేదన్నారు. కౌన్సిలర్ పద్మజ మాట్లాడుతూ తేరువద్ద నుంచి లక్ష్మీ బజార్ కూడలి వరకూ తరకూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్లపై పశువులు సంచరిస్తూనే ఉన్నాయన్నారు. స్పందించిన కమిషనర్ దివాకర్‌రెడ్డి త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పాలకమండలి అజెండా, అత్యవసర సమావేశపు అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఈ రవిప్రకాష్‌నాయుడు, ఏఈలు నరసింహులు, ప్రతాప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

తెగుళ్ల నివారణతో అరటిలో దిగుబడులు

బుక్కరాయసముద్రం : తెగుళ్లను నివారించడం ద్వారా అరటి పంటలో దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డా॥త్రికాల మాధవి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నీలారెడ్డిపల్లి, బోడిగానిదొడ్డి గ్రామాల్లో అరటి పంట సాగు, తెగుళ్ల నివారణపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ సిగటొక తెగులు నివారణ కోసం ప్రొపికొనజోల్ మందును ఒక లీటరు నీటికి 1 మిల్లీలీటర్, టిల్ట్ స్ప్రేయింగ్ ఒకసారి చేయాలన్నారు. తామర పురుగు నివారణకు ఇమిడా క్లోప్రిడ్ మందును ఒక మిల్లీలీటర్ ఒక లీటర్‌కు కలిపి అరటిగెల తడిసేలా స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శైలజ, ఐఎన్ఐ కంపెనీ ప్రతినిధులు సురేష్, రైతుసేవ సిబ్బంది నరేంద్ర, జగన్ పాల్గొన్నారు.

గూబనపల్లిలో చిరుత సంచారం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లిలో చిరుత సంచరించింది. మంగళవారం రాత్రి తిమ్మరాజు అనే రైతుకు చెందిన ఆవు దూడపై చిరుత దాడి చేసి చంపేసింది. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చిరుత సంచారం సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు తెలియజేయడంతో అటవీశాఖ, పశుసంవర్ధకశాఖ అధికారులు గ్రామంలో పర్యటించారు. మరణించిన ఆవుదూడను పరిశీలించారు. చిరుత దాడిలోనే దూడ మరణించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి మధుబాబు, పశుసంవర్ధకశాఖ అధికారి మంజునాథ్, రాము, మూర్తి పాల్గొన్నారు.

ఎన్‌పిఎస్ఎస్ యాప్ ద్వారా తెగుళ్ల గుర్తింపు

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

అనంతపురం : నేషనల్ పెస్ట్ సర్వేయిలేన్స్ సిస్టమ్(ఎన్‌పిఎస్ఎస్) యాప్ ద్వారా రైతులు తెగుళ్లను ముందస్తుగా గుర్తించి వాటి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లా రైతు శిక్షణ కేంద్రంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల రైతులు, వ్యవసాయ అధికారులకు ఎన్‌పిఎస్ఎస్ జాతీయ పురుగు నియంత్రణ పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిపిఎంసి విజయవాడ కార్యాలయం నుంచి ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వీరయ్య చౌదరి హాజరై ఇన్‌పిఎస్ఎస్ యాప్ ఉపయోగించే విధానాన్ని తెలియజేశారు. మొబైల్‌లో ఈయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి డిడిఎ మద్దిలేటి, డీఆర్సీ జేడీ కార్యాలయ టెక్నికల్ ఏవో వెంకటకుమార్, రెండు జిల్లాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యు.ఉమామహేశ్వరమ్మ

పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే భరించాలి

ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు

రాయదుర్గంలో ర్యాలీ చేపట్టిన ఏపి రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రబీ పంటల బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన రైతు సంఘం నాయకులతో కలిసి ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు. కనీస మద్దతు ధర లేక నష్టపోతున్న రైతులను అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు పంటల బీమా పథకం అప్పగించడం వల్ల బీమా ప్రీమియం పేరుతో కంపెనీలు లాభాలు గడిస్తున్నాయని, రైతులకు మాత్రం బీమా పరిహారాలు అందడం లేదన్నారు. కావున అన్ని పంటకు సమగ్ర పంటల బీమా పథకం తీసుకొచ్చి ప్రభుత్వ ఇన్సూరెన్స్ కంపెనీని నడిపి బీమా పరిహారాలు రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పెట్టుబడి పెట్టి నష్టపోతున్న కౌలు రైతులకు పంటల బీమా పరిహారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున, రైతు సంఘం నాయకులు కృష్ణానాయక్, తిప్పేస్వామి, రమేష్, మధుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : రబీ పంటల బీమా ప్రీమియం పేరుతో రైతులపై ఎలాంటి భారం వేయ వద్దని ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు డిమాండ్ చేశారు. రబీ పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలని తెలపడంతో సన్న, చిన్న కారు, పేద రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వమూ ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి ప్రీమియం చెల్లించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం డివిజన్ కార్యదర్శి శుభాన్, నాయకులు వెంకటేశులు, మల్లికార్జున, జయరామనాయక్, రంగనాథ్, అశోక్, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : రబీ పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం తగదని ఏపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్.రాయుడు మండిపడ్డారు. ఆయన బెళుగుప్పలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమగ్ర పంటల బీమా పథకం తీసుకొచ్చి ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీ నడిపి బీమా పరిహారాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు లక్ష్మిరెడ్డి, నరసింహులు, వన్నూరుస్వామి, వెంకటేశులు, మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పరికరాలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ఆర్‌కెవి పథకం కింద ఎఫ్‌పిఒ సంఘాల్లో ఉన్న రైతులకు రాయితీపై యాంత్రీకరణ పరికరాలు అందిస్తామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీనాయక్ సూచించారు. మండలంలోని కదరం, వడ్డవన్నూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన కంది పంటను పరిశీలించి పురుగుల ఉధృతిని గుర్తించి నివారణ మందులను సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రబీలో సాగు చేసిన పంటలకు కామన్ సర్వీస్ సెంటర్, డిజిటల్ అసిస్టెంట్, పోస్ట్ ఆఫీస్‌లో పంటబీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఆయన వెంట ఏవో మహేంద్ర, ఎఇఒ, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు ఉన్నారు.

పత్తి రైతులు పేర్లు నమోదు చేసుకోండి

గుత్తి : గుత్తి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, పత్తి పండించిన రైతులు విక్రయాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో ముస్తాక్ అహ్మద్ తెలిపారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ పంటలబీమా చేసుకోవడానికి డిసెంబర్ 15వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. రబీ సీజన్‌లో వేరుశనగ, పప్పుశెనగ, మొక్కజొన్న, జొన్న, వరి, టమోటా, మామిడి పంటలు సాగు చేసిన వారికి బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిఈఓ అరుణ, ఏపిసి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడ్డూరు : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు రబీ ఈ క్రాప్ బుకింగ్, క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ఎకరాకు పప్పుశెనగకు రూ. 450, మొక్కజొన్నకు రూ. 525, జొన్నకు రూ. 315 ప్రీమియంను డిసెంబర్ 15వ తేదీ లోపు చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించిన రైతులు మాత్రమే ఇన్సూరెన్స్‌కి అర్హులు అన్నారు. కార్యక్రమంలో విహెచ్‌వి రవితేజ, విఎఎ రజిని, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఉరవకొండ : మండలంలోని నింబగల్లు గ్రామంలో ఏవో శుభకర్, విడపనకల్లు మండలంలోని కనకముక్కల గ్రామంలో ఏవో పెన్నయ్య ఆధ్వర్యంలో పప్పుశెనగ పంట పొలాన్ని పరిశీలించారు. వారు డ్రోన్ ఆవశ్యకతను రైతులకు వివరించారు. డ్రోన్ టెక్నాలజీని వాడుకుంటే తక్కువ నీటితో ఎక్కువ ఎకరాల్లో తక్కువ సమయంలో మందులు పిచికారి చేయవచ్చన్నారు. కూలీల సమస్య తగ్గుతుందన్నారు. అలాగే తెగుళ్లు, నివారణ మందులు, సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఉద్యాన అధికారి మాట్లాడుతూ గ్రామంలో ఎండుమిరప అధిక విస్తీర్ణంలో సాగు చేశారని ప్రస్తుతం పూత దశలో ఉందని పురుగుల నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిటీసీ ఈశ్వర్, ఏఈఓలు రాఘవేంద్ర, కైలాస్, ఎంపీఇఒ హేమ, విఏఏలు అక్షిత, సురేఖ, రైతులు ఆదినారాయణ, వెంకటస్వామి, రామనాథ్, అశోక్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-శింగనమల

ఆటోలు, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. మండలంలోని నాయనపల్లి క్రాస్‌లో బుధవారం సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ప్రతి ప్యాసింజర్ ఆటోను ఆపి తనిఖీలు చేశారు. ఎక్కువ మందిని తరలిస్తున్న ఆటోలను ఆపి ప్రయాణికులను దింపి, డ్రైవర్లు, ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు నిబంధనలకు అతిక్రమిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పుట్లూరు : మండలంలోని ఆటో డ్రైవర్లకు ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై ఆటో డ్రైవర్లు, వాహనదారులు, ప్రయాణికులకు వివరించారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోల్లో ఓవర్ లోడ్ ఎక్కించరాదని, అన్ని రికార్డ్స్ తప్పకుండా పెట్టుకోవాలని సూచించారు. అనంతరం ఎ.కొండాపురం వద్ద అనంతపురం-తాడిపత్రి రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. అధికలోడుతో వెళ్తున్న ఆటోల డ్రైవర్లకు అపరాధ రుసుము విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పుట్లూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ హేమాద్రి

వాహనాల తనిఖీ

మండలంలోని ఎస్.గూడూరు గ్రామంలో తాడిపత్రి-ఎల్లనూరు రోడ్డులో సిఐ సత్యబాబు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలు, డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుము విధించినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. అనంతరం సిఐ వాహనదారులు, ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు.

కంబదూరు ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-కంబదూరు

మండల నూతన ఎస్ఐగా ఎంకే. ప్రవీణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. గతంలో పని చేసిన ఎస్ఐ పెద్దవడుగూరుకు బదిలీ కుప్పం నుంచి ప్రవీణ్ ఇక్కడికి వచ్చారు. ఎస్ఐ మాట్లాడు తూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించేలా పని చేస్తానన్నారు. మండలంలో ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా ప్రతి సోమవారం అర్జీ ఇస్తే 74 గంటల్లో సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి విమర్శించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కోర్సు పూర్తయినా కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. వైసిపి హయాంలో జగన్ విద్యార్థులకు సకాలంలో అన్నీ చెల్లించారన్నారు.

'ఉల్లాస్ సర్వే'ను వేగవంతం చేయండి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో ఉల్లాస్ సర్వే ప్రగతి నివేదికను త్వరితగతిన పూర్తి చేయాలని వయోజన విద్య సూపర్వైజర్ రవి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో నందకిషోర్ ఆధ్వర్యంలో వెలుగు సీసీలతో ప్రగతి నివేదికపై తనిఖీ చేపట్టారు. మండలంలో వయోజన విద్య సర్వే నత్తనడక సాగుతుందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రణాళికలో అందుకు సంబంధించిన గ్రామీణ ప్రాంతాల, కుటుంబ సర్వే రిపోర్టును ఆయా గ్రామ వివోలు, సీసీలు వయోజన విద్యా ప్రగతి నివేదికను అప్లోడ్ చేసి త్వరితగతిన సర్వే పూర్తి చేయాలన్నారు. దానితో పాటు మ్యాచింగ్ అండ్ బ్యాచింగ్‌ను పూర్తి చేయాలన్నారు. సాధ్యమైనంత మేర వయోజన విద్య సర్వేను పూర్తి చేసి గ్రామాల్లో కేంద్రాలు నిర్వహించాలన్నారు.

వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎపి వాల్మీకి ఫెడరేషన్ నూతన డైరెక్టర్ వైపి.రమేష్‌బాబుని బుధవారం పట్టణంలోని చల్లా భవన్‌లో నారా లోకేష్ జాతీయ అభిమాన సంఘం అధ్యక్షులు ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో వినియోగదారుల సంఘం అధ్యక్షులు చల్లా కిషోర్ అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ కళ్యాణదుర్గం పట్టణ అభివృద్ధిలో రమేష్‌బాబు కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శర్మాస్‌వలి, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ నరసయ్య, షాదీ మహల్ ప్రెసిడెంట్ ఆకుల రహిమాన్, పుర ప్రముఖులు చల్లా రాజశేఖర్, లింగప్రసాద్, ఓబుళరాజు, కుందుర్పి ఎంఇఒ తిప్పేస్వామి, బిఎస్ఎన్ఎల్ నారాయణ, వెటర్నరీ మల్లి, చాపరి హనుమంతరెడ్డి, తిప్పేస్వామి, అరుణకుమారి, ప్రియ, మహిళా సంఘ అధ్యక్షురాలు గోపాల్, సోమనాథ్, రాజేష్, నాయకులు సునీల్‌కుమార్, బసవరాజు, కటిక సందీప్‌కుమార్, మణితేజ, చాంద్‌బాషా పాల్గొన్నారు.



రమేష్‌బాబుని సన్మానిస్తున్న ఆనంద్‌రెడ్డి, తదితరులు

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-బెళుగుప్ప

మండలంలోని ఎర్రగుడి గ్రామంలో బుధవారం గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామోత్సవంలో గురుస్వాములు శ్రీనివాస్‌రెడ్డి, పర్వతప్ప, పెన్నప్ప, మాలధారులు పాల్గొన్నారు

యల్లనూరు : యల్లనూరులో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గురు స్వాముల ఆధ్వర్యంలో చెక్క భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

స్వచ్ఛ భారత్ ఛైర్మన్ పట్టాభిరాంను కలిసిన ఉద్యోగులు

ప్రజాశక్తి-యల్లనూరు

రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ భారత్‌లో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ ఎంఆర్‌సి ఉద్యోగులకు భద్రతతో పాటు జీతం పెంచాలని కోరుతూ అమరావతి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో స్వచ్ఛ భారత్ ఛైర్మన్ కోమటిరెడ్డి పట్టాభిరాంను రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. సమస్యలపై పట్టిభిరాం సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయుడు, కమిటీ సభ్యులు వెంగలరావు శ్రీనివాసరావు, అయ్యప్ప రెడ్డి, శాస్త్రి, రాంబాబు, జయరాం పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ ఛైర్మన్ పట్టాభిరాంతో ఉద్యోగులు

ప్రభుత్వ కళాశాల టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపల్ డాక్టర్ డి. పద్మశ్రీ అధ్యక్షతన జిసిటిఎ (ప్రభుత్వ కళాశాల టీచర్స్ అసోసియేషన్) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆర్ట్స్ కాలేజ్ యూనిట్ అధ్యక్షుడిగా డాక్టర్ డి.చంద్రశేఖర్ (ఫిజిక్స్), కార్యదర్శిగా డాక్టర్ జి.వెంకటేష్(సాంఖ్యకశాస్త్రం), కోశాధికారిగా డాక్టర్ పి.కేశాలు (గ్రంథాలయం), మహిళా కార్యదర్శిగా డి.షర్మిలరామయ్య (వాణిజ్య శాస్త్రం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి

ప్రజాశక్తి-గుత్తి

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎపి బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో 'బాల్య వివాహ ముక్త్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రత్యేక సంస్థలు ఉన్నాయన్నారు. బాలలతో పని చేయించినా, బాల్యవివాహాలు చేసినా శిక్షార్హులవుతారన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సిడిరొ ఎన్.ఢిల్లేశ్వరి, ప్రిన్సిపల్ విజయలత, ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరి, న్యాయవాది విసి.గంగాధర్‌కుమార్, కోర్టు టైపిస్ట్ సాధిక్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

కళ్యాణదుర్గం రూరల్ : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సిడిపిఒ లక్ష్మిప్రసన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన 'బాల్య వివాహ ముక్త్ భారత్' కార్యక్రమానికి సిడిపిఒ హాజరై బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలు, నిరోధక చట్టాలు, శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. చివరగా 'బాల్య వివాహ ముక్త్ భారత్' పై ప్రతిజ్ఞ చేపించారు. ప్రిన్సిపల్‌తో పాటు డాక్టర్ రాజేష్ బాలికలకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ భారతి, సుధ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : 'బాల్య వివాహం వద్దు.. చదువు ఎంతో ముద్దు' అని ఐసిడిఎస్ సూపర్వైజర్లు కాశింబీ, రామాంజనమ్మ తెలిపారు. 'బాల్య వివాహ ముక్త్ భారత్'లో భాగంగా స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ సౌభాగ్యలక్ష్మి అధ్యక్షతన బాల్య వివాహాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 'మాకు బాల్యం కావాలి.. బాల్య వివాహం వద్దు' అంశంపై చర్చించారు. సూపర్‌వైజర్లు బాల్య వివాహాలపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీచర్స్, అంగన్వాడీ కార్యకర్తలు సత్యమ్మ, శాంతమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : స్థానిక కేజీబీవీలో డాక్టర్ కార్తీక్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల చేత బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడం అందరి బాధ్యత అన్నారు. బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఒ నాగరత్న బాయి, ఎఎన్ఎం రాధమ్మ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న కౌలు రైతులకే ఆలయ భూములివ్వాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

సాగులో ఉన్న కౌలు రైతులకే ఆలయ భూములు ఇవ్వాలని సిపిఎం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎండోమెంట్ గ్రూప్ టెంపుల్ ఆఫీస్ ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పదేళ్ల నుంచి మండలంలోని రేణుమాకలపల్లి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ భూములను 9 మంది కౌలుకు తీసుకొని సాగు చేస్తూ ఏటా గుత్త చెల్లిస్తున్నారన్నారు. అయితే వారికి కాకుండా ఇతరులకు రశీదులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఈ విషయంపై 4 నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన సాగు చేస్తున్న రైతులు సురేష్, నారాయణస్వామి, కంచన్న, నాగేష్, లింగరాజు, ఎర్రలింగన్న, ఈశ్వరయ్యలకే రశీదులు ఇవ్వాలన్నారు. ధర్నాలో సిపిఎం నాయకులు ఎస్.మధుసూదన్, రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ముష్టూరు వెంకటేసులు, అశ్వత్, మారుతి, ప్రసాద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతులు

తిరుపతి రైలు రద్దు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

కదిరిదేవరపల్లి-తిరుపతి మధ్య ప్రయాణించే రైలు(07589/07590) పాక్షిక రద్దు గడువును డిసెంబర్ 1 నుంచి 31వ తేదీ వరకూ పొడిగించినట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ అరవింద్ హర్లే బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం గుంతకల్లు, తిరుపతి మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుంది.

4న ప్రజాహక్కుల సభ

ప్రజాశక్తి-ఉరవకొండ

సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 4వ తేదీ విజయవాడలో జరిగే ప్రజా హక్కుల సభ, ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు వేమన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో కరపత్రాన్ని ఆవిష్కరించి, అనంతరం ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను గాలికి వదిలి, మత రాజకీయాలు చేస్తున్న ఎన్‌డిఎ కూటమిని తెలుగు గడ్డ నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బాల కృష్ణ, ఎఐఎస్ఎ నాయకులు భీమేష్, చరణ్, కిరణ్, సూరి, నరసింహ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ బుధవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. నగరంలోని సూర్యనగర్ రోడ్డులో మరువ వంక ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. త్వరలో నడిమివంక, మరువ వంక ప్రొటెక్షన్ వాల్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్న హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు. నారాయణపురం పంచాయతీలోని స్టాలిన్ నగర్‌లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ పీడీ శైలజతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఎన్ని ఇళ్ల నిర్మాణం చేపట్టారు, అవి ఏ స్టేజిలో ఉన్నాయని ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణంలో అర్హులందరికీ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

నారాయణపురంలో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఆర్ఎం నూతన కార్యాలయం నిర్మిస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు బుధవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ భవనాలను పరిశీలించారు. బస్టాండ్ ఆవరణలో వర్షం నీరు నిల్వ ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వారు ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ త్వరలోనే రూ. 1.8 కోట్ల వ్యయంతో ఆర్ఎం కార్యాలయం నిర్మాణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడిపత్రి

రోడ్డు ప్రమాదాలు, భద్రతా చర్యలపై బుధవారం స్థానిక ఆర్టీసీ బస్సు డిపోలో ఎంవిఐలు శ్రీనివాసులు, రాజగోపాల్ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు, భద్రతా చర్యలు, అదనపు అనధికార మార్పులను ఎలా తగ్గించాలనే అంశాలపై డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కల్పించారు. గూడ్స్ వాహనాల్లో ప్యాసింజర్లు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో వాహనం డ్రైవ్ చేయరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనకు లోబడి నడుచుకోవాలని ప్రమాదరహితంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ నాయక్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎల్‌సిపై నిరంతర నిఘా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శింగనమల

నియోజకవర్గంలో హెచ్ఎల్‌సి నీరు సక్రమంగా పారేందుకు కాలువపై అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమె హెచ్ఎల్‌సి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హెచ్ఎల్‌సిలో నీటి పారుదలకు సంబంధించి రైతులు లస్కర్‌ల మీద ఆధారపడ్డారన్నారు. అలాకాకుండా ఎఇ, డిఇలు కూడా కెనాల్ నీరు పారుదల విషయంలో రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. త్వరలో కెనాల్‌లో నీరు పారుదలను తనిఖీలు చేస్తామని తెలిపారు. కెనాల్ నుంచి సుబ్బరాయసాగర్‌కు నీరు సరిగా పారడం లేదని, ఈ విషయంపై సంబంధిత అధికారి నిర్లక్ష్యం వీడాలని సూచించారు. అలాగే బుక్కరాయ సముద్రంలోని నారాయణప్పకుంటకు కెనాల్ నీరు వదలాలని ఎమ్మెల్యే తెలిపారు.

ఫీవర్ సర్వే తనిఖీ

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని నిట్టూరు సచివాలయ పరిధిలోని గ్రామంలో జరుగుతున్న ఇంటింటి ఫీవర్ సర్వేను బుధవారం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. రాత్రివేళ దోమతెరలు వాడాలన్నారు. అనారోగ్యం అనిపిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం సబ్ సెంటర్‌లో ఎంఎఫ్ టు రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట ఎంఎల్‌హెచ్‌పి హర్షిత, ఆశా కార్యకర్త రాజేశ్వరి ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి : అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-యాడికి

గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జేసీ. అస్మిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం నల్లరాళ్ల తిమ్మాపురంలో పర్యటించి తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం యాడికి మార్కెట్ యార్డులో నీటి సంపులను పరిశీలించి తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా జనవరిలోపు పైపులైన్ల మరమ్మతులు చేయాలన్నారు. భైరవకొండపై ఉన్న ట్యాంకులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. హాస్పిటల్ కాలనీ, చెన్నకేశవస్వామి కాలనీ, చౌడేశ్వరికాలనీల్లో డ్రెయినేజీ సమస్యను 3 నెలల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి అపరిశుభ్రంగా ఉండడంతో డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలన్నారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ ప్రతాపరెడ్డి, ఎంపీడీవో వీర్రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాంగోపాల్‌రెడ్డి, జేఈ దేవ, సచివాలయ సిబ్బంది, టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, పట్టణ అధ్యక్షులు ఆదినారాయణ, నాయకులు వేలూరు రంగయ్య, దడియాల ఆది, రాజశేఖర్‌నాయుడు, రామచంద్రారెడ్డి, సుభాన్, చంద్ర, బొట్టు శేఖర్, మధురాజు, నీలకంఠ, నారాయణస్వామి, రవికుమార్‌రెడ్డి, చలమారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, విజయ్, నరసింహచౌదరి ఉన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచండి

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపిడిఒ అలివేలమ్మ టిఎలకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని, హార్టికల్చర్ పెంచాలని, మినీ గోకులాలను త్వరగా పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ చిన్న కేశవులు, టిఎలు, బిఎఫ్టీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమం దుర్వినియోగం, సైబర్ నేరాలు, బెదిరింపులపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందిందో అదే స్థాయిలో దుర్వినియోగం చేస్తున్నారన్నారు. సైబర్ బెదిరింపులు, నేరాలకు పాల్పడే వారిని శిక్షించడానికి సరైన చట్టాలు రూపొందించాలన్నారు. ఇప్పటికే డిజిటల్ టెక్నాలజీ మార్ఫింగ్, సైబర్ బెదిరింపులు, నేరాలకు సంబంధించిన సెక్షన్లను చేర్చారన్నారు. సదస్సులో అధ్యాపకులు పరిషా ఫిర్దోష్, అమీర్ హుస్సేన్, నారాయణ, కోదండరాములు, నాగప్ప, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన

ప్రజాశక్తి-తాడిపత్రి

దక్షిణ కాశీగా పిలువబడే బుగ్గ రామలింగేశ్వరుడి ప్రత్యేకతను ప్రతిబింబించేలా, తాడిపత్రి వైభవం నలుమూలల విస్తరించేలా పట్టణంలో 20 అడుగుల శివుని విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఫ్లైఓవర్ ఔటర్ రింగు రోడ్డు సర్కిల్ వద్ద శివుని విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఈనెల 25వ తేదీ జెసిపిఆర్ భూమిపూజ చేశారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, యుగంధర్, తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం మండల కార్యదర్శి ఎస్.మధుసూదన్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రీన్ ల్యాండ్ రెస్టారెంట్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు ముష్టూరు వెంకటేశులు, అశ్వర్థ, మారుతి, ప్రసాద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.